క్లుప్తంగా

ఘనంగా సంతోషిమాత దేవాలయ వార్షికోత్సవం



లక్ష్మీ హోమంలో పాల్గొన్న భక్తులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని శ్రీ సంతోషి మాత దేవాలయ 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మ వారికి అభిషేకం తదితర పూజలు, అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి అశోక్, కార్యదర్శి దొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ ఎంట్రెన్స్‌కు ఏర్పాట్లు పూర్తి

నంగునూరు(సిద్దిపేట): ఈనెల 24వ తేదీన జరిగే పాలీసెట్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ఎగ్జామ్ కన్వీనర్ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట పరిధిలో మొత్తం 2,307 మంది విద్యార్థులు పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందుకు సిద్దిపేట పట్టణంలో ఆరు సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. హాల్‌టికెట్‌పై ఫొటో లేనివారు గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకోవాలన్నారు. నిమిషం నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు(గజ్వేల్): విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల నరికివేత కారణంగా బుధవారం ములుగు మండలం చిన్నతిమ్మాపూర్, వంటిమామిడి, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కొక్కొండ సబ్‌స్టేషన్ పరిధిలోని కొక్కొండ, బస్వాపూర్, సింగన్నగూడ, శ్రీరాంపూర్ గ్రామాలకు, క్షీరసాగర్ సబ్‌స్టేషన్ పరిధిలోగల క్షీరసాగర్, అన్నసాగర్, గంగధార్‌పల్లి గ్రామాలకు, తున్కిబొల్లారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వర్గల్(గజ్వేల్): నిర్వహణ పనుల కారణంగా బుధవారం వర్గల్ మండలం మైలారం, జబ్బాపూర్ గ్రామాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో మండల ఏఈ సంతోష్ తెలిపారు. రెండు గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణం ఆరపల్లె చెరువులో ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మంగళవారం డిమాండ్ చేశారు. రోడ్డు పనుల పేరుతో దాదాపు రూ.20 లక్షల విలువగల మట్టిని తరలించారని ఆరోపించాడు. సదరు కాంట్రాకర్ మట్టిని ప్రైవేటు భూముల్లో తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంపై రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. రూ.లక్షల విలువైన మట్టి ని తరలిస్తున్న సదరు కాంట్రాక్టర్ పై కేసు నమోదు చేయాలని, స్పందించకుంటే ఏసీబీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆ పార్టీ అభ్యర్థి రాకేష్‌కు మద్దతుగా మంగళవారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పట్టభద్రులను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు.

పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి

తెలంగాణ సమగ్ర శిక్ష అదనపు సంచాలకుడు రమేష్

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం సర్కార్ కృషి చేస్తోందని తెలంగాణ సమగ్ర శిక్ష అదనపు సంచాలకుడు గాజర్ల రమేష్ పేర్కొన్నారు. మండలంలోని సిర్సనగండ్ల, కొండపాక గ్రామాల్లోని హైస్కూళ్లలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పక్కగా ఉండేందుకు అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. మౌలిక వసతులతో పాఠశాలలు ప్రారంభం నాటికి సిద్ధంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌ఏఈ తిరుపతిరెడ్డి, హెచ్‌ఎంలు విఠల్, విఠల్ నాయక్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..



ముస్తాబైన దుబ్బరాజేశ్వర స్వామి ఆలయం

- నేటి నుంచి దుబ్బరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ నుంచి భక్తుల రాక
- 23న పార్వతీ దుబ్బరాజేశ్వర స్వామి కల్యాణోత్సవం
- 24న స్వామివారి రథోత్సవం

దుబ్బాక: దుబ్బరాజేశ్వర స్వామి బ్రహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దుబ్బరాజేశ్వర స్వామి ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి నుంచి బ్రహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాల కోసం ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

దుబ్బరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజులపాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. బుధవారం తెల్లవారుజామునే మంగళ ధ్వని, వేద పఠనం, ఆలయ ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 23న గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పార్వతి దుబ్బరాజేశ్వర స్వామిల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరుగుతుంది. అంతకు ముందు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాస్నపనం, మూలమంత్ర హవనం, బలిహరణ, స్వామివారికి ఎదుర్కోలు నిర్వహిస్తారు. శుక్రవారం దుబ్బరాజేశ్వర స్వామి రథోత్సవం నేత్రపర్వంగా జరుగుతుంది.



దుబ్బరాజేశ్వర స్వామి

వివిధ రాష్ట్రాల నుంచి భక్తుల రాక



స్వామివారి బ్రహోత్సవాలకు భారీగా భక్తులు తరలి వస్తారు. ఇందుకోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్సవాల్లో పాల్గొనేందుకు సిద్దిపేట జిల్లా నలుమూలల నుంచే కాకుండా కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, సిరిసిల్ల, జనగామ జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు.

– దుబ్బరాజం శర్మ, ఆలయ వంశపారంపర్య ప్రధాన అర్చకుడు

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్

కొమురవెల్లి(సిద్దిపేట): ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో చట్టసభలలో ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈనెల 27వ తదీన జరిగే ఎన్నికలలో తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యాత ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు లింగంపల్లి కనుకరాజు, మండల యూత్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిద్దాం

మద్దూరు(హుస్నాబాద్): వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. మల్లన్నకు మద్దతుగా జనగామ నియోజకవర్గం ధూళ్మిట్ట మండలం కూటిగల్ గ్రామంలో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పనిచేసే వ్యక్తి, కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు కమలాకర్ గౌడ్, రెడ్యా నాయక్ తండా కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

రాష్ట్ర యువజన సంఘాల సమితి ప్రధాన కార్యదర్శి అశోక్

సిద్దిపేటకమాన్: అధికార కాంగ్రెస్ పార్టీ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర యువజన సంఘాల సమితి ప్రధాన కార్యదర్శి అశోక్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యువతకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని, వాటన్నింటిని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో శేషుకుమార్, కనకయ్య, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్‌ను స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్‌యార్డులో బయో మైనింగ్ విధానంలో జరుగుతున్న రిసైక్లింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు.



రీసైక్లింగ్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మిరుదొడ్డి(దుబ్బాక): రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి మల్లేశం హెచ్చరించారు. మంగళవారం ఆయన మిరుదొడ్డిలో మాట్లాడుతూ రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు కొనుగోలు రసీదు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎల్‌ఓసీ అందజేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన అక్కారం లక్ష్మీ 20 రోజులుగా గుండెజబ్బుతో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని ఓ హాస్పటల్‌లో చికిత్స పొందుతోంది. చికిత్స కోసం రూ.5 లక్షలు అవసరం. లక్ష్మీ పరిస్థితిని గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు బంగారు రెడ్డి డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆయన స్పందించి ప్రభుత్వం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరయ్యేలా కృషి చేశారు.

◆ బోనస్ ఇవ్వాలి

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ధాన్యానికి బోనస్ ఇస్తామని ఇప్పుడు సన్నాలకు ఇస్తామనడం తగదన్నారు.

◆ మూడోసారి బీజేపీదే అధికారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టబోతుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తొడుపునూరి వెంకటేశం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేశం మాట్లాడుతూ దేశ అభివృద్ధి, సంక్షేమం, రక్షణ బీజేపీతోనే సాధ్యమని ప్రజలు భావిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 12కు పైగా పార్లమెంట్ స్థానాలను బీజేపీ గెలవబోతుందని, రఘునందన్‌రావు గెలుపు ఖాయమన్నారు.

◆ ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

మద్దూరు(హుస్నాబాద్): కమలాయపల్లి చెరువు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని గ్రామస్తులు రెవెన్యూ, పోలీసు అధికారులను కోరుతున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా రేయింబవళ్లు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది గ్రామస్తులు తమ వ్యవసాయ బావుల వద్ద ఇసుకను నిల్వచేస్తున్నట్లు తెలిపారు.

ఉపకార వేతనానికి ఎంపిక

సిద్దిపేటరూరల్: గత నవంబర్‌లో నిర్వహించిన నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షలో ఇర్కోడ్ ఆదర్శ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు మంగళవారం తెలిపారు. విద్యార్థులు భరతేశ్వర్, మోహిత్, వెంకట్, యశ్వంత్, భవ్య శ్రీ,కృపాలిని, హర్షిత, ఉదయ కిషోర్, వైష్ణవి, జస్వంత్ కుమార్ , సాయిసంతోషి అర్హత సాధించారన్నారు. సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.

కొండాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని..

మిరుదొడ్డి(దుబ్బాక): నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు మండల పరిధిలోని కొండాపూర్ ఉన్నత పాఠశాల 8వ తరగతి చదివిన విద్యార్థిని దాసరి శివాని ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం స్వప్నారెడ్డి మంగళవారం తెలిపారు. విద్యార్థినికి నాలుగేళ్ల పాటు, ఏడాదికి రూ.12 వేల చొప్పున ప్రభుత్వం ఉపకార వేతనం అందజేస్తుందన్నారు.

మరమ్మతులు చేయిస్తాం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట గ్రామ చెరువును ఇరిగేషన్ శాఖ డీఈ సురేష్, ఏఈ రమ్యశ్రీ మంగళవారం పరిశీలించారు. చెరువుకు ఉన్న రెండు తూములను పరిశీలించి కొన్నిలోపాలు ఉన్నట్లుగా గుర్తించామని, వాటికి మరమ్మతులు చేయిస్తామన్నారు. అలాగే చెరువు నుంచి వచ్చే నీటి ప్రవాహం తట్టుకునేలా మత్తడి వద్ద కల్వర్టు నిర్మించేందుకు నిర్ణయించామన్నారు.

నిబంధనలు పాటించాలి

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట కమాన్: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపేవారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్‌లు అమర్చితే చర్యలు తప్పవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన 30 వాహనాల సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించినట్లు తెలిపారు. మైనర్ డ్రైవింగ్‌పై 509 కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో మైనర్, ట్రిబుల్ డ్రైవింగ్, నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చేలా సైలెన్సర్‌లు బిగించే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపడతామని తెలిపారు. రంగనాయక సాగర్ పరిసర ప్రాంతాల్లో బైక్ రైడింగ్ నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బైక్ రైడింగ్‌కు పాల్పడే వాహనదారులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యలు, అధిక శబ్దం వచ్చేలా సైలెన్సర్‌లు బిగించిన వాహనాల వివరాలు సిద్దిపేట, గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులకు ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని, వారికి ప్రజలు సహకరించాలని కోరారు.



అనురాధ, సిద్దిపేట పోలీసు కమిషనర్

రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి

బీజేపీ నాయకుల వినతి

దుబ్బాకటౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడవటంతో రైతులు ఆందోళనలో ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆందోళనను పట్టించుకోకపోవడం బాధాకరమని దౌల్తాబాద్ బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఐకేపీ సెంటర్లలో తడిసిన ధాన్యన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని మంగళవారం దౌల్తాబాద్ తహసీల్దార్ సుజాతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలు, రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా వడ్లకు బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణ గౌడ్, నరసింహారెడ్డి, గణేష్, శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హోమం.. విశేష అభిషేకం

నేడు నృసింహావిర్భావం

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రంలో స్వామివారి జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడోరోజు మంగళవారం తెల్లవారుజామున గర్భగుడిలో కొలువైన స్వామివారికి విశేష అభిషేకం చేశారు. యాగశాలలో శ్రీసుదర్శన నారసింహ మూలమంత్ర హవనం, కుంకుమార్చన జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు నృసింహావిర్భావం

ఉత్సవాల చివరిరోజు బుధవారం ఉదయం శ్రీవారికి శతఘటాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు శ్రీనృసింహావిర్భావం, భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుంది.



కుంకుమార్చన చేస్తున్న మహిళలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉత్సవాలకు అంకురార్పణ

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవేణుగోపాలుని కోవెలలో మంగళవారం రాత్రి స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ముఖమండపంలో వేదికపై శ్రీరుక్మిణీ, సత్యభామ, వేణుగోపాలుడి ఉత్సవ మూర్తులను ఆసీనులను చేశారు. ఆలయ అర్చకుడు వేదాంతం మురళీధరాచార్యులు నేతృత్వంలో పుణ్యాహవాచనం, విష్వక్సేనారాధన, రుత్విక్ వరణం, మృత్సంగ్రహణం జరిపారు. శ్రీవేణుగోపాలుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేసి హారతి, మంత్ర పుష్పం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక

కొండపాక(గజ్వేల్): ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలం మంగోల్ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు ముష్టం శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహాచారి, నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



హుస్నాబాద్‌లో రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- సాంకేతిక విప్లవం రాజీవ్ ఘనత
- కొనియాడిన కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్: ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి సాంకేతిక రంగాన్ని పరుగులు పెట్టించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ ఆశయాలు కొనసాగిస్తాం

దుబ్బాకటౌన్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగిస్తామని దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ అన్నారు. దుబ్బాక పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జాతీయ విద్యా విధానాన్ని దేశమంతటా..

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. రాజీవ్ గాంధీ 1986లో జాతీయ విద్యా విధానాన్ని దేశమంతటా విస్తరించే ప్రయత్నం చేశారన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు చింతల మల్లారెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చింతల బాలరాజు, కిసాన్ సెల్ అధ్యక్షుడు కొత్తకొండ పోశెట్టి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అక్బర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు భానోతు భాస్కర్ నాయక్, కట్కూర్ గ్రామ సింగిల్ విండో వైస్ చైర్మన్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గల్‌లో..

వర్గల్(గజ్వేల్): దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం వర్గల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని బెజ్జంకిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రంగానికి పునాదులు వేసిన..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీదే అని జిల్లా ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సూర్యవర్మ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కో–ఆర్డినేటర్ దాసరి రాజు, డీసీసీ ప్రధాన కార్యదర్శి జంగోని శ్రీనివాస్, దిలీప్, మోతే కుమార్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మిద్దె ప్రసాద్, నవీన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, నియోజకవర్గ అధ్యక్షుడు బడికోల్ రాకేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ చిన్నకోడూరు మండల నాయకులు అర్జున్, మొగిలి రాకేష్, సాజిద్ పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, 5వ వార్డు కౌన్సిలర్ ఆడెపు నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ సేవలు చిరస్మరణీయం

మిరుదొడ్డి(దుబ్బాక): దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామి గౌడ్ మంగళవారం అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని పార్టీ మండల కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భూంపల్లి ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి బాలాగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అక్కపల్లి బాల్‌నర్సాగౌడ్, ప్ర ధాన కార్యదర్శి కోనపురం బాలు, మండల ఫిషర్ మెన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని వెలికట్ట క్రాస్ రోడ్డులోగల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.